క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



తుని రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన చెన్నకేశవరావు

తుని: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు అన్నారు. తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా మోటారు వెహికల్ చట్టంలో కఠినమైన సెక్షన్లు తీసుకు వచ్చిందన్నారు. ముఖ్యంగా మైనర్లకు మోటారు సైకిల్ ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఇసుక, మట్టి తదితర వాటిని తరలించే వాహనాలకు వేబిల్లు, మైనింగ్ శాఖకు ట్యాక్స్ చెల్లింపు రశీదు ఉండాలన్నారు. పేకాట, కోడిపందేలు, గుండాట, గంజాయి తదితర అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చెన్నకేశవరావును కోటనందూరు, తుని రూరల్, తొండంగి ఎస్సైలు, ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



ఏలేశ్వరంలో దివ్యాంగురాలికి ఫిజియోథెరపీ చేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రతి శుక్రవారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు ఎంఈఓ-2 వరలక్ష్మి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్ హెచ్‌వీ దివ్యమేఘన ఆధ్వర్యంలో దివ్యాంగులకు సేవలు చేశారు. భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ మాట్లాడుతూ ఈ కేంద్రానికి తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకు రావాలన్నారు. భవిత కేంద్రం టీచర్లు వాణిపద్మజ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు శివారుకూ సాగునీరు



ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్: ఆయకట్టు శివారు ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. శుక్రవారం ఇ.గోకవరంలోని సుబ్బారెడ్డి సాగర్ జలాశయం నుంచి 10 వేల ఎకరాల ఆయకట్టుకు ఆమె సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బారెడ్డి జలాశయం పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇరిగేషన్ డీఈఈ టి.పోచారావు, ఈఈ ఏఈఈ ఎస్‌కే ఇబ్రహీం, నాయకులు అమరాది వెంకట్రావు, వనపర్తి నాగేశ్వరరావు, ఇళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు



కిర్లంపూడిలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

కిర్లంపూడి: మండలంలో శుక్రవారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా వాన పడింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో వరద నీరు వరి మడులను ముంచెత్తింది.

ఏలేశ్వరం: వర్షాలతో నియోజకవర్గంలో చెరువుల్లోకి నీరు చేరింది. పల్లపు ప్రాంతాలు, రహదారులు ముంపులో ఉన్నాయి. రోగాలు ప్రబలకుండా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉధృతంగా బురద కాలువ

గోకవరం: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు బురద కాలువ, ఊర కాలువల్లో వరదనీరు భారీగా ప్రవహించింది. సూరంపాలెం ప్రాజెక్టులో నీటిమట్టం 105 మీటర్లకు చేరడంతో ఒక గేటు ద్వారా నీటిని విడిచి పెట్టడంతో బురద కాలువలో ఉధృతంగా నీరు చేరింది.



గోకవరం శివారున బురద కాలువలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

చోటు లేక.. చెట్టు నీడకు..

- అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇబ్బందులు
- ప్రాజెక్ట్ సమావేశాల నిర్వహణకు షెల్టర్ కరవు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



శంఖవరంలో చెట్ల కింద సమావేశమైన అంగన్‌వాడీ కార్యకర్తలు

శంఖవరం: బాలలకు ఆట పాటలతో విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాలు. అక్కడి నుంచే బాలలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తుంటారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త అంశాలు తెలిపేందుకు, నూతన విధానాలు వివరించేందుకు ప్రాజెక్ట్ సమావేశాలు తప్పనిసరి. అయితే వీటి నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. నెలవారీ కార్యకలాపాలు సమీక్షించుకోవడానికి సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాజెక్ట్ సమావేశాలు ఆరు బయటే చెట్ల కిందే నిర్వహించాల్సిన దుస్థితి వచ్చింది. సరైన షెల్టర్ లేక శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం సమీపంలో ఉన్న చెట్ల నీడలోనూ, పాడుబడిన భవనాల్లో, దేవాలయాల వద్ద నిర్వహించుకోవాల్సి వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయంపై అనేక సార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలో శంఖవరం, రౌతులపూడి మండలాల్లో మొత్తం 116 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. కత్తిపూడి సెక్టార్ పరిధిలో 27, రౌతులపూడి సెక్టారులో 29, ఎస్.పైడిపాల సెక్టార్ పరిధిలో 30 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల బరువు, ఎత్తుకు సంబంధించిన కొలతలు, వారందరికి అవసరమైన పౌష్టికాహారం నివేదికలపై ప్రతి నెలా ప్రాజెక్ట్ సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుంటాయి. ఈ సమావేశాలకు ఎలాంటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు.



శంఖవరంలో ఇరుకైన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

చిన్న భవనమే గతి

శంఖవరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం చిన్న భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రాజెక్టు సమావేశాలకు అవకాశం లేదు. దీంతో పక్క మండలాల్లోని సుమారు 30 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న తమకు సరైన షెల్టర్ లేక ప్రతి నెలా అవస్థలు తప్పడం లేదని అంగన్‌వాడీ సిబ్బంది అంటున్నారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో సమావేశాలు, సభలు నిర్వహించడానికి అవసరమైన షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలి



కేపీ మల్లవరంలో విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య



ఎస్.పైడిపాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందించిన ఎంపీపీ, జెడ్పీటీసీ

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. శుక్రవారం ఎస్.పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మితో కలసి విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో రాయితీలు అందిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, గొల్లు వెంకటరమణ, పారేపల్లి శ్రీరామకృష్ణ, హెచ్‌ఎం వై.చక్రవర్తి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా పథకంలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, ఎస్.రాజేష్, పైల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలలు సాఫల్యం చేసుకోండి

తుని రూరల్: విద్యార్థులు తమ కలలను సాఫల్యం చేసుకునేందుకు ఉన్నతంగా చదువుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శుక్రవారం కేఓ మల్లవరం, రాపాక గ్రామాల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, సర్పంచ్ డొంక సత్యవతి, ఎంఈఓ పరవాడ గీతాదేవి, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.

తుని: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో విద్యార్థినులకు కిట్లను ఎమ్మెల్యే యనమల దివ్య పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఎమ్మెల్యే యనమల దివ్య పంపిణీ చేశారు. ఎంఈఓ షేక్‌బాబ్జి, నాయకుడు యనమల రాజేష్ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు

కిర్లంపూడి: స్థానిక శివాలయం వద్ద శ్రీభగవాన్ సత్యసాయి మందిరంలో 230 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మరో 30 మందిని మెరుగైన వైద్యం కోసం పరమహంస యోగానంద నేత్రాలయానికి రిఫర్ చేసినట్లు కంటి వైద్యుడు కిరణ్ తెలిపారు. ఆసుపత్రి మేనేజర్ చంటిబాబు, మెడికల్ ఇన్‌చార్జి అజ్జరపు సత్యనారాయణ మూర్తి, శ్రీభగవాన్ సత్యసాయి సేవా సమితి జిల్లా కో ఆర్డినేటర్ బద్రినారాయణ, బోనం సత్యసాయి తేజ తదితరులు ఉన్నారు.

దుర్గామీనాక్షి అమ్మవారికి పూజలు



శంఖవరం: మండలంలోని సీతంపేట గ్రామంలో వేంచేసి ఉన్న దుర్గామీనాక్షీ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పూలు, పండ్లు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భజనా బృందాల భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



వెంకటాపురంలో పెరటి తోటలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోకవరం: జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గోకవరం మండలం రంపయర్రంపాలెం, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం మహిళలకు పెరటి తోటల పెంపకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి కరణం మాధవి మాట్లాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషక పదార్థాలు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేడ్లు అందుతాయన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ పెరటి తోటల్లో పౌష్టికాహారం ఇచ్చే మొక్కలు పెంచుకోవాలని అన్నారు. అలాగే 60 మంది మహిళలకు రిలయన్స్ ఫౌండేషన్ వారిచే 10 రకాలు విత్తనాలు, నారు అందించారు. సమావేశంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.సూర్యకుమారి, దుర్గాదేవి, మహిళా రైతులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకం



టెట్, డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

గండేపల్లి, జగ్గంపేట: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ప్రత్యేకమైందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేటలోని కాపు కల్యాణ మండపంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా టెట్, డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు టెట్, డీఎస్సీలకు ఉచిత కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థులకు పుస్తకాలు అందజేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు



వెంకటాపురం శివారున చెట్టును ఢీకొన్న కారు

గోకవరం: మండలంలోని వెంకటాపురం గ్రామ శివారున శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం కొత్తవీధికి చెందిన తుర్రం సురేష్, భవానీ, వారి కుమారుడు హేమంత్‌కుమార్ దొరలు కలసి బైక్‌పై రంపచోడవరం మండలం కె.గోపాలపురం వెళుతుండగా వెంకటాపురం శివారున ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అనంతరం రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి సంఘటనపై హెచ్‌సీ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

పిఠాపురం: పాము కాటుకు ఓ కౌలు రైతు మృతి చెందాడు. పిఠాపురం మండలం గోకివాడకు చెందిన కౌలు రైతు కొమ్ము నాగేశ్వరరావు (58) శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లి గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. పొలం నుంచి ఇంటికి వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

యువకుడిపై కేసు

గండేపల్లి: బాలికను మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉప్పలపాడుకు చెందిన బాలిక (17)ను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఆమె ఫిర్యాదు ఇచ్చింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జంక్షన్ జామ్..

- నాలుగు రోడ్ల కూడలిలో ఇబ్బంది
- ఇరుకు దారిలో ప్రయాణికుల పాట్లు

శంఖవరం: నిత్యం రద్దీగా ఉండే జంక్షన్ అది.. ఎప్పుడూ ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది.. వచ్చే, వెళ్లే వాహనాలతో ఎటూ కదలలేని పరిస్థితి ఉంటోంది. ఈ రోడ్డు ఎక్కితే జనానికి నరకం కనిపిస్తోంది. అదే శంఖవరం మండలంలో కత్తిపూడి నాలుగు రోడ్ల జంక్షన్. ఇటు శంఖవరం వెళ్లే రోడ్డు, అటు కాకినాడ మరోవైపు రాజమహేంద్రవరం, తుని వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపి వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఆటోలు, బైక్‌లు, చిరు వ్యాపారుల బండ్లు రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.



కత్తిపూడి బస్టాండ్ సెంటర్లో వాహనాల రద్దీ

పాఠశాలలకు, కళాశాలలకు, దేవాలయాలకు, ప్రభుత్వ కార్యకలాపాలకు, వ్యాపారాల నిమిత్తం నిత్యం అనేక మంది ఈ రోడ్డు వెంబడే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు ఇరుకుగా, రద్దీగా ఉండడంతో కనీసం నడకకే నరకం కనిపిస్తోంది.

విస్తరణ జరగక..

ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో కత్తిపూడి మీదుగా వెళ్లే 216 రహదారి, 16 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. గ్రామంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ రోడ్డు విస్తరణ జరిగింది. అయితే మళ్లీ యథాతథంగా కొంత మంది ఆక్రమించడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ప్రజలు, ప్రయాణికుల సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్డు వెడల్పు చేయడంతో పాటు పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు

ప్రమాదాలతో హడల్



కత్తిపూడి అన్ని గ్రామాలకు ముఖ్య కూడలి. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. అంతేకాక ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. అధికారులు, పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలి.

– కొల్లు శ్రీను, జి.కొత్తపల్లి

రహదారిపైనే వాహనాలు



కత్తిపూడి ప్రధాన రహదారిపైనే అధిక సంఖ్యలో వాహనాలు నిలపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– మాదే శామ్యూల్‌రాజ్, నెల్లిపూడి

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



ఇన్‌చార్జి తహసీల్దార్ కుశరాజుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుని రూరల్: సామాన్యులపై భారం మోపి, సంపన్నులకు దేశ సంపదను దోచిపెట్టేలా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌పై తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కందుల కుశరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విభజన చట్టం హామీలు నెరవేర్చాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణానికి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు అదుపు చేసి నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కామేశ్వరి, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలే శ్రేయస్కరం



ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



ఎస్.అన్నవరంలో సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ శ్రీలత

తుని రూరల్: నవజాతి శిశువులకు తల్లిపాలే శ్రేయస్కమని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. శుక్రవారం తుని మండలం ఎస్.అన్నవరం, ఆర్‌కే నగర్, టి.తిమ్మాపురంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి, గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ నవజాతి శిశువులకు ఆరు నెలల వరకూ తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆ తర్వాత అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, వైవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: తల్లి పాలతో శిశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌పీఎస్ లక్ష్మి అన్నారు. ధర్మవరంలోని అంగన్‌వాడీ కేంద్రం-13లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ధర్మవరం సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భరించలేం బాబోయ్..



పీఈ చిన్నాయపాలెం - ఎ.కొత్తపల్లి రహదారిలో దుర్వాసన వస్తున్న మామిడి టెంకలు

తొండంగి: ఆ దారిలో వెళ్తే ముక్కు మూసుకోవాల్సిందే.. కనీసం కాసేపు ఆగలేని పరిస్థితి. పీఈ చిన్నాయపాలెం నుంచి ఎ.కొత్తపల్లి వెళ్లే మార్గంలో మామిడి తాండ్రకు వినియోగించిన టెంకలు పొలాల్లో వేయడంతో దుర్వాసన వస్తోంది. రైతులతో పాటు అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పీఈ చిన్నాయపాలెం సమీపంలో ఇటీవల మామిడి తాండ్ర తయారీ కేంద్రాలు వెలశాయి. ఇంత వరకూ బాగానే ఉన్నా, ఈ కేంద్రాల్లో తాండ్ర తయారీకి అవసరమైన మామిడి గుజ్జు తీయగా మిగిలిన టెంకలను సమీపంలో పామాయిల్ తోట వద్ద వేశారు. దీని కారణంగా దుర్వాసనతోపాటు వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు



గోకవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న మాదిగలు



కొత్తకొట్టాంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆరుగుల మోషే తదితరులు

కోటనందూరు: ఎస్సీ వర్గీకరణతో దళిత కులాల్లో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని మాదిగ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో శుక్రవారం కొత్తకొట్టాంలో మోషే ఆధ్వర్యంలో దళితులు సంబరాలు చేసుకున్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుతూ సందడి చేశారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు మోషే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి కుమార్, చలికే గోవింద్, ఆరుగుల కొండబాబు, మాణిక్యం, కాపారపు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

తీర్పు హర్షణీయం

ప్రత్తిపాడు రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు కందా వీరాస్వామి అన్నారు. ఒమ్మంగిలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణను హర్షిస్తూ ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి ఇంటి వీరనాగేశ్వరరావు, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్త తేజమూర్తుల ఉషారాణి, టీడీపీ నేతలు సత్యంశెట్టి సీతబాబు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై గోకవరం ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో అంబేడ్కర్, రాజా సెంటర్లలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డప్పులు వాయించి ఆనందం వ్యక్తం చేశారు.

జగ్గంపేట: స్థానిక ట్రావెలర్స్ బంగ్లా నుంచి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సుదీర్ఘ పోరాట ఫలితంగా వర్గీకరణ సాధించుకున్నామని నాయకులు అన్నారు.